## నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు



గోషామహల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.విక్టర్‌తో చర్చిస్తున్న హైదరాబాద్ కలెక్టర్, డిప్యూటీ డీఈఓ అనుదీప్ దురిశెట్టి

అబిడ్స్, నవంబర్ 1 : ఈ నెల 3 నుంచి జరిగే ఎన్నికల నామినేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేశామని హైదరాబాద్ కలెక్టర్, డిప్యూటీ డీఈఓ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం సాయంత్రం అబిడ్స్ జీహెచ్ఎంసీ మున్సిపల్ కార్యాలయంలోని గోషామహల్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. రిటర్నింగ్ అధికారి వి.విక్టర్‌తో చర్చించి నామినేషన్ల ప్రక్రియ విషయమై పలు సూచనలు, సలహాలు అందజేశారు. 10 వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని వివరించారు. ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు గాను సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు వీడియో కెమెరాల ద్వారా చిత్రీకరణ, ఆర్ఓ కార్యాలయం లోపల, బయట ఎలక్ట్రానిక్ వాచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది కోసం పోస్టల్ బ్యాలట్‌లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 3986 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రౌడ్ టు బీ ఏ ఓటర్ స్టిక్కర్‌లను సిబ్బంది అతికించారని తెలిపారు. ఆర్ఓ విక్టర్, ఏఆర్ఓలు మన్నె ప్రేమ్‌కుమార్, సయ్యద్ సయీదుద్దీన్, శైలజలతో నామినేషన్ల ప్రక్రియప చర్చించి పలు సూచనలు చేశారు.

## బీఆర్ఎస్ అభ్యర్థులకు రక్షణ కల్పించాలి



ప్రస్తుత పరిస్థితులలో బీఆర్ఎస్ అభ్యర్థులకు రక్షణ కల్పించాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఆర్సీ పీఆర్వో శ్రీనివాస్‌కు ఫిర్యాదు పత్రం అందజేశారు. **- సుల్తాన్‌బజార్, నవంబర్ 1**

## టీఎన్జీవో హౌసింగ్ బోర్డు యూనిట్ కార్యవర్గం ఎన్నిక



టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు ముజీబ్‌హుస్సేనీని సన్మానిస్తున్న టీఎన్జీవో హౌసిం గ్ బోర్డు యూనిట్ నూతన కార్యవర్గం

సుల్తాన్‌బజార్, నవంబర్ 1: టీఎన్జీవో హౌసింగ్ బోర్డు యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. బుధవారం నాంపల్లి గృహకల్ప ఆవరణలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యాలయంలో ఎన్నికల అధికారిగా జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారిగా శాఖ ప్రచార కార్యదర్శి వైదిక్ శస్త్ర వ్యవహరించారు. టీఎన్జీవో హౌసింగ్ బోర్డు యూనిట్ అధ్యక్షుడిగా జీవీ రమణారెడ్డి, ఉపా ధ్యక్షులుగా సీహెచ్ సంజీవరెడ్డి, కార్యదర్శిగా ఆర్.జగదీశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా ఎ.రామ్ కుమార్, ఎం.ప్రణయ్, కోశాధికారిగా ఆర్.రఘురాం కుమార్, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా ఆజ్మీరా రాంబాబు, మహ్మద్ అబ్దుల్ సలీం, కార్యవర్గ సభ్యులుగా మహమ్మద్ అబ్దుల్ ము క్తథర్, జే సాయివర్ధన్, మహమ్మద్ రహీం, జి.భాగ్యలక్ష్మి, బి.వెంకటేశ్వర్లు,కే నిరంజన్‌రెడ్డి, మహమ్మద సజావుద్దీన్, సి.మల్లేశ్ ఎన్నికైనట్లు వారు వివరించారు. అనంతరం జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేసి అభినందించారు. యూనిట్ నూతన కార్యవర్గం ముజీబ్‌హుస్సేనీతో పాటు కార్యదర్శి ఎస్.విక్రమ్‌కుమార్, ఎన్నికల అధికారులు రాజ్ కుమార్, వైదిక్ శస్త్రను శాలువాలతో సన్మానించారు.

# నీచ రాజకీయాలు మానుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్



హైదరాబాద్ జిల్లా ఆర్డీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్, నవంబర్ 1 : దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ శ్రేణికి చెందిన వ్యక్తి కత్తితో దాడి చేసి అంతమొందించేందుకు ప్రయత్నించాడని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆరోపించారు. దీంతో కాంగ్రెస్ నాయకుల నీచ రాజకీయం బహిర్గతమైందన్నారు. ఎంపీపై దాడి చేసిన వారిని చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో నందకిశోర్ వ్యాస్ బిలాల్ నియోజకవర్గం నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం గోషామహల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీది పిరికిపంద చర్య అన్నారు. పదేండ్లుగా ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో చిచ్చుబెట్టేందుకు ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తాం..

గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్‌ను చిత్తుగా ఓడిస్తామన్నారు. కుల మతాల మధ్య చిచ్చుబెట్టి గెలవాలని రాజాసింగ్ చూస్తేంటే ప్రజలు ఆయనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. హిందువులు, ముస్లింలతో పాటు అన్ని వర్గాల ప్రజలు సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమంతో బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు.

పదేండ్లలో ఏ మాత్రం అభివృద్ధి చేయని రాజాసింగ్‌కు ఇక ఇంటికి పంపడమే మిగిలిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జయశంకర్, శంకర్‌సింగ్ జమేదార్, కోటి శైలేశ్ కురుమ, ప్రదీప్ రాజ్, రాజాసింగ్, అనిత, ఫయూమ్, రుచి మిశ్రా పాల్గొన్నారు.

## కురుమల అభ్యున్నతికి కృషి



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, సంఘం నాయకులు


అబిడ్స్, నవంబర్ 1 : కురుమల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం అన్నారు. బుధవారం ముస్లింజంగ్ వంతెన వద్ద కురుమ సంఘం భవనంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి నారాయణ, ఉపాధ్యక్షుడు రెక్కాల కొండల్‌రాజు, కార్యదర్శి ఎక్కాల కన్నా, కోశాధికారి కట్ట మల్లేశం, ట్రస్ట్ బోర్డు సభ్యులు రేవల్లి ప్రకాశ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యెగ్గె మల్లేశం మాట్లాడుతూ.. ఏపీ కురుమ సంఘం ప్రధాన కార్యదర్శినని చీలంపల్లి రమేశ్‌కుమార్ 11 కేసులను వేయగా చివరి కేసులో కూడా ఆయన ఓడి పోయారని తెలిపారు. పదేండ్ల క్రితం ఏపీ కురుమ సంఘం, తెలంగాణ కురుమ సంఘం వేరు అని తీర్మానం చేసి తెలంగాణ కురుమ సంఘానికి ఎన్నికలు నిర్వహించడం జరిగిందని, అదే విధంగా రెండోసారి కూడా ఎన్నికలు నిర్వహించినట్లు వివరించారు. రాష్ట్ర కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి బండారి నారాయణ, రెక్కాల కొండల్‌రాజు మాట్లాడుతూ.. కురుమ సంఘాన్ని భ్రష్టు పట్టించిన చీలంపల్లి రమేశ్ కుమార్ సంఘంతో ఆయనకు ఎలాంటి సంబంధం లేకున్నా కేసులు వేసి పరాజితులయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో బన్నె బుచ్చప్ప పాల్గొన్నారు.

## 162 మందికి జైలు

అబిడ్స్, నవంబర్ 1: ట్రాఫిక్ డీసీపీ–3 పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్టోబర్ మాసంలో మొత్తం 1,114 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు కాగా.. అందులో 958 కేసులు పరిష్కారం అయ్యాయని ట్రాఫిక్ డీసీపీ డి. శ్రీనివాస్ గుప్తా తెలిపారు. ఇందులో 162 మందికి జైలు శిక్ష విధించగా 14 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద స్టాప్‌లైన్ పడిన సమయంలో వాహనాలను నిలిపి వేయాలని, ఫ్రీ లెఫ్ట్ వేలో వాహనాలను నిలపరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని, నంబర్ ప్లేట్ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




ప్రజాస్వామ్య భారతదేశంలో ప్రజల్లో ఐక్యత అవసరమనని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమాఅన్నారు. కళాశాల ఆవరణలో జాతీయ సమైఖ్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మంజుల, డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సుదర్శన్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ పరంధాములు పాల్గొన్నారు. **- సుల్తాన్‌బజార్, నవంబర్ 1**



హలో మాల.. చలో బస్తీ బాట కార్యక్రమాన్ని పూల్‌బాగ్ లో నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర మాల పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య, గన్‌ఫౌండ్రి మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా పాల్గొన్నారు.

**- అబిడ్స్, నవంబర్ 1**

## ఇట్రోడ్ సామాజిక సేవా ట్రస్ట్ వార్షికోత్సవం

రవీంద్రభారతి, నవంబర్ 1: ఇనిస్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ రిలీఫ్ రిహబిలిటేషన్ ఆఫ్ డిసేబుల్డ్ డిస్ట్రయిజ్‌డ్ చిల్డ్రన్ (ఇట్రోడ్) సామాజిక సేవా ట్రస్ట్ సంస్థ 28వ వార్షికోత్సవం బుధవారం రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో నిర్వహించారు. దివ్యాంగులకు, అనాథలకు, పేదలకు ఎక్సలెన్సీ అవార్డులతోపాటు అంధుల వివాహం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్డీఏ శాస్త్రవేత్త చైర్మన్ డాక్టర్ జి. సతీశ్‌రెడ్డి విచ్చేశారు. దివ్యాంగులు, అనాథలు, పేదలకు నిత్యావసర సరుకులు, అవార్డులను ప్రదానం చేశారు. ఇట్రోడ్ ట్రస్ట్ సంస్థ వ్యవస్థాపకుడు మధుకర్‌రెడ్డి సామాజిక సేవలు చేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ .. 28 ఏండ్లుగా పేదలు, దివ్యాంగులకు అన్ని రంగాల్లో చేయూతనివ్వడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 27 మంది దివ్యాంగులు, అనాథలకు పెండ్లిళ్లు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, ఇట్రోడ్ సీఈవో జి పద్మ, ఎన్.పవన్‌కుమార్, సీఎస్ రంగరాజన్ పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలతో డీఆర్డీఏ శాస్త్రవేత్త సతీశ్ రెడ్డి, మధుకర్ రెడ్డి